ఈనాడు మంచిర్యాల
ఆదివారం సెప్టెంబరు 29, 2024


మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

శ్రమ తోడైతే.. గెలుపు నీదే..

● ఆ అధికారుల స్ఫూర్తితో ఐఏఎస్ సాధన

న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం: పట్టుదలతో సాధన చేస్తే ఏదైనా సాధించగలం.. మంచి ఆలోచనలతో పనిచేసే అధికారులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. "జవహర్ నవోదయలో చదువుతున్న సమయంలో పాఠశాల ఛైర్మన్‌గా ఉన్న అప్పటి కలెక్టర్ నర్మదేశ్వర్‌లాల్ విద్యాభివృద్ధికి కృషి చేశారు. బిహార్‌లో కలెక్టర్‌గా పనిచేసిన కే.కే. పాటిల్ అవినీతిని నిర్మూలించి, పరిపాలన విభాగాలను గాడిలో పెట్టారు. ఆ అధికారులను స్ఫూర్తిగా తీసుకుని ఐఏఎస్ కావాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నా. అందుకు తగినట్లుగా సాధన చేశా. శ్రమతోడై నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించాను. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా సేవలు అందిస్తున్నా." విజయ ప్రస్థానం గురించి ఆయన మాటల్లోనే..

సర్కారు బడిలోనే చదువు

మాది సమస్తీపూర్ జిల్లాలోని ధరహర మండలం బిరోజ్‌పూర్ గ్రామం. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం సాగింది. ఒకటి నుంచి 5వ తరగతి వరకు స్వగ్రామంలో.. తర్వాత సమస్తీపూర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివా. ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఐఐటీ పూర్తి చేశా. అనంతరం ఓఎన్‌జీసీలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే ఐఏఎస్ కోసం సాధన చేశా.

20 గుంటల స్థలం మాత్రమే ఉంది

నాన్న విశ్రాంత ఉపాధ్యాయుడు మనోజ్‌కుమార్ సింగ్. తల్లి పుష్పకుమారి గృహిణి. అన్నయ్య ప్రభాత్ ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నాన్నకు 1982లో ఉపాధ్యాయుడిగా ఎంపిక జాబితాలో పేరు వచ్చింది. అప్పుడు ఆ ఉద్యోగం ఆయనకు ఇవ్వకుండా తక్కువ మార్కులు ఉన్న వ్యక్తికి ఇచ్చారు. న్యాయస్థానంలో కేసు వేసి గెలవడంతో 2012లో నాన్నకు ఉద్యోగం వచ్చింది. అందుకే తొమ్మిదేళ్లకే ఉద్యోగ విరమణ పొందాల్సి వచ్చింది. మాకు కేవలం 20 గుంటల స్థలం మాత్రమే ఉంది.

ఉద్యోగం చేస్తూనే సన్నద్ధమయ్యా

ఐఐటీలో మూడో సంవత్సరంలో ప్రభుత్వ కొలువు వచ్చింది. చదువు పూర్తయిన తర్వాత డెహ్రాడూన్‌లో ఆరేళ్లు ప్రభుత్వ ఉద్యోగం చేశా. ఆ సమయంలో ఐఏఎస్‌కు సన్నద్ధమయ్యా. రెండుసార్లు రాత పరీక్షల్లో ఎంపికై ఇంటర్వ్యూలో విఫలమయ్యా. మూడోసారి ప్రయత్నించగా ఐఆర్ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీస్)కు ఎంపికై ఇన్‌కం ట్యాక్స్ విభాగంలో పని చేశా. నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యా. 2018 బ్యాచ్‌కి చెందిన నేను మంచిర్యాల జిల్లాలో శిక్షణ కలెక్టర్‌గా.. తర్వాత పెద్దపల్లి జిల్లాలో అదనపు కలెక్టర్‌గా మూడేళ్లు పని చేశా. అక్కడ పని చేస్తున్న సమయంలో కుటుంబ పెద్దలు స్వస్తికతో వివాహం జరిపించారు. ఆమె గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్నారు. తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా.. అక్కడి నుంచి ఇటీవల పదోన్నతిపై మంచిర్యాల జిల్లాకు కలెక్టరుగా వచ్చా.

తెలంగాణ వంటకాలంటే చాలా ఇష్టం

తెలంగాణలో నాన్‌వెజ్ వంటకాలు అంటే చాలా ఇష్టం. ఇక్కడ మటన్, చికెన్ వంటకాలు ఎక్కడా లేని విధంగా రుచిగా తయారు చేస్తారు. క్రికెట్, టేబుల్ టెన్నిస్ అంటే ఇష్టం. క్రికెట్ ఆడను కానీ చూస్తా. టెన్నిస్ మాత్రం ఇంట్లోనే ఆడతా.

లక్ష్యంతో చదవాలి

మనం చదువుకోవడానికి ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోంది. యువత ప్రభుత్వ ఫలాలను ఉపయోగించుకుని అన్ని రంగాల్లో దూసుకెళ్లాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యంతో చదివితే అనుకున్నది సాధిస్తారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


వైద్య శిబిరంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్

నస్పూర్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం నస్పూర్ పుర కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సఫాయి మిత్ర సురక్ష శిబిర్ కింద వైద్య శిబిరం నిర్వహించి పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కమిషనర్ సతీష్, ఛైర్మన్ వేణు, డిప్యూటీ డీఎంహెచ్‌వో అనిత, సమత తదితరులు పాల్గొన్నారు.

అవగాహనే ముఖ్యం.. సాధనతో పదిలం

న్యూస్‌టుడే, దండేపల్లి: విద్యార్థి ఉన్నత చదువులకు తొలిమెట్టు పదో తరగతి. మంచి జీపీఏ సాధించడంతో పాటు విషయ అవగాహనపై పట్టు పెంచుకుంటే ఇంటర్‌తో పాటు వివిధ సాంకేతిక కోర్సుల్లో చేరి ఉన్నత చదువులు అభ్యసించే అవకాశం ఉంది. మార్చిలో పరీక్షలు ఉండటంతో సమయాన్ని వృథా చేయకుండా అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలంటే ఏవిధంగా సాధన చేయాలి.. జీపీఏ పెరగాలంటే ఏయే అంశాలపై పట్టు సాధించాలో తెలుసుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఇప్పటి నుంచే ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ఈ నేపథ్యంలో గణితం, భౌతిక రసాయన, సాంఘిక, జీవశాస్త్ర ఉపాధ్యాయులు అందజేస్తున్న సూచనలు ఇలా...



సూత్రాలు.. గ్రాఫ్‌లు విజయానికి దోహదం



- గణితంలో సూత్రాలు, గ్రాఫ్‌ల నిర్మాణం మార్కులకు దోహద పడతాయి.
- బహుపదులు, సాంఖ్యక శాస్త్రం, రేఖీయ సమీకరణాలు, వర్గ సమీకరణాల నుంచి ఒక గ్రాఫ్ అడుగుతారు.
- సాంఖ్యక శాస్త్రంలో ఓజీవ వక్రం, సమితుల్లో వెన్ చిత్రాలు సాధన చేయాలి.
- త్రికోణమితిలో అనువర్తనాల నుంచి లెక్కలు అడుగుతారు. ఇందులోని కోణ విలువలు, సూత్రాలు చాలా ముఖ్యం.
- వాస్తవ సంఖ్యలు, సంభావ్యత, సమితులు, త్రికోణమితి, క్షేత్రమితి, నిరూపక జ్యామితి, శ్రేఢులు అధ్యాయాలను బాగా సాధన చేస్తే మంచి మార్కులు వస్తాయి.

-మిట్టపల్లి సంతోష్‌కుమార్, గణిత ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఖానాపూర్, ఆదిలాబాద్ జిల్లా

ప్రయోగాలే ప్రధానం..



- ప్రయోగాలనుంచి ఒకటి అడుగుతారు.. ఇందులో ఉద్దేశం, పరికరాలు, ప్రయోగ విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫలితాన్ని కచ్చితంగా సాధన చేయాలి. చక్కగా పటాలు గీసే భాగాలు గుర్తించాలి.
- సమస్యల సాధనకు సూత్రాలను గుర్తుంచుకోవాలి.
- పట్టికల విశ్లేషణ, బొమ్మలు, భేదాలు, ఉదాహరణలు, పోలికలు, పటాలలో తప్పులు సవరించడం తదితర అంశాలను గుర్తుంచుకోవాలి.
- సమీకరణాలను తుల్యం చేయటం, దర్పణాలలో, కటకాలలో ఏర్పడు ప్రతిబింబాలు, వీటి కిరణ చిత్రాలు, నిజజీవితంలో వీటి ఉపయోగాలు, ఓమ్ నియమం, నిరోధాల శ్రేణులు, విద్యుత్తు ప్రవాహంపై సాధన చేయాలి. నవీన ఆవర్తన పట్టిక, పరమాణు నిర్మాణం, క్వాంటమ్ సంఖ్యలు, ఆర్బిటాళ్ల ఆకృతులను అవగాహన చేసుకుంటే మంచి మార్కులు వస్తాయి.

-గోలి రాజగోపాల్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, పొన్కల్ పాఠశాల, నిర్మల్ జిల్లా

సమకాలీన అంశాలే కొలమానం



- పేరాగ్రాఫ్ ఇచ్చి విశ్లేషించడం, వ్యాఖ్యానించడం ద్వారా ఆరు మార్కులు వస్తాయి. పట్టిక ఇచ్చి దీనిలోని దత్తాంశాలను విశ్లేషించడం ద్వారా ఆరు మార్కులు సాధించవచ్చు.
- జనాభా, అక్షరాస్యత, దేశ సమగ్రత, గ్లోబల్ వార్మింగ్, హరితహారం ఇలా అడిగే వ్యాసాలు రాసే తీరును తెలుసుకోవాలి.
- పటం, సమాచార నైపుణ్యాలు, వ్యాఖ్యానం, ప్రశంస, సమకాలీన అంశాలపై శ్రద్ధ చూపాలి.
- భారతదేశ భౌగోళిక స్వరూపం, ఉత్పత్తి ఉపాధి, నదులు, నీటి వనరులు, ఆహారభద్రత, సుస్థిర అభివృద్ధి, దేశ విభజన, స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సాధన ఉద్యమ పాఠ్యాంశాలపై సాధన చేయాలి.
- జవాబులు పాయింట్ల వారీగా రాస్తే మంచి మార్కులు వస్తాయి...

-జి.రవిశంకర్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, గంగారాం పాఠశాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా

పటాలు... పట్టికలను పట్టుబడితే చాలు..



- పటాల భాగాలు గుర్తించేటప్పుడు అన్ని ఒకవైపే రాయాలి.
- ప్రతీ పాఠంలో ఫ్లో చార్టు, భేదాలు, ప్రయోగశాల కృత్యాలు చేస్తే 10 మార్కులు వస్తాయి.
- కిరణజన్య సంయోగ క్రియ-శ్వాసక్రియ, అవాయుశ్వాసక్రియ-వాయుశ్వాసక్రియ, రక్తప్రసరణ, విసర్జన, లైంగిక ప్రత్యుత్పత్తి-అలైంగిక ప్రత్యుత్పత్తి, అనువంశికత, లింగ నిర్ధారణ, పోషకాహార లోపంతో కలిగే వ్యాధులు, నెఫ్రాన్ వ్యవస్థ అంశాలను చదివితే మంచి గ్రేడు సాధించవచ్చు.
- నేర్చుకున్న అంశాలను నిజ జీవితానికి అన్వయించే ప్రశ్నలు అడుగుతారు. వీటిని సాధన చేయాలి.

-గంప రవీందర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, దండేపల్లి పాఠశాల, మంచిర్యాల జిల్లా

విద్యుత్తు సంస్థలో బదిలీల సందడి


జిల్లా విద్యుత్తు సంస్థ కార్యాలయం

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థ (ఎన్పీడీసీఎల్) పరిధిలోని అన్ని విభాగాల బదిలీలకు రంగం సిద్ధమైంది. విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూన్ 30 వరకు ఒకేచోట రెండేళ్లు పూర్తిచేసుకున్న వారందరూ(ఇందులో యాభై శాతం) బదిలీకి అర్హులే అని పేర్కొన్నారు. వచ్చే నెల ఏడో తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తికావాలని అందులో పేర్కొంది. కానీ ఈ బదిలీలతో వినియోగదారుల సేవలు మెరుగవడం పక్కన పెడితే ఎలాంటి ప్రయోజనం ఉన్నట్లు కనిపించడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో పాతుకుపోయిన సిబ్బంది, సంఘాల నాయకులు, వారి అనుచరులకు తప్పితే మిగతా వారికి ఉపయోగం అంతంత మాత్రమే అని సంస్థలోని ఉద్యోగుల నుంచే విమర్శలు వస్తున్నాయి. శనివారం సాయంత్రం వరకే బదిలీకి అర్హత ఉన్నవారి వివరాలు ఎస్ఈ కార్యాలయం నుంచి పంపినట్లు సమాచారం.

విధుల చోటు మాత్రమే మారేది..

ప్రస్తుతం సీఎండీ విడుదల చేసిన విధివిధానాలు మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రయోజనం చేకూరేలా కనిపించడం లేదని తెలుస్తోంది. ఓఅండ్ఎం సిబ్బంది నుంచి ఏఈ, ఏడీఈ స్థాయి వరకు ఏ ఒక్కరూ జిల్లా నుంచి కదిలే పరిస్థితి ఈ ఆదేశాలతో లేకుండా పోయింది. జిల్లా వ్యాప్తంగా లైన్‌మెన్, ఆ పైస్థాయి ఉద్యోగులు జిల్లాలో ఎక్కడ విధులు కేటాయించినా చాలా వరకు జిల్లా కేంద్రం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వినియోగదారుల సేవల్లో జాప్యం, అంతరాయం ఏర్పడుతోంది. ఈ బదిలీలతోనూ అదే జరగనుంది. విధుల చోటు మారే అవకాశముంది తప్పితే నివాస ప్రాంతం మారేలా లేదు. ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహిస్తుండటంతో అవినీతితో పాటు ఇతర వ్యాపకాలపై మొగ్గుచూపడం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరిలో ఎక్కువగా పైరవీకారులు, సంఘాల నాయకులే ఉండటం గమనార్హం. ఇక సంఘాలతో సంబంధం లేని, పైరవీలు చేయలేని మరికొందరు మారుమూల ప్రాంతాలకే పరిమితమవుతున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చేందుకు ఎప్పుడో ఒకసారి అవకాశం వస్తుందనే ఆశతో ఏళ్ల కొద్ది జిల్లా సరిహద్దుల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఈసారి కూడా నిరాశ ఎదురుకానుంది.

జిల్లాలో సిబ్బంది వివరాలు
ఎస్ఈ -1
డీఈ- 3
ఏడీఈ- 15
ఏఈ(సివిల్)-1
ఏఈ(ఎలక్ట్రికల్)-42
సబ్-ఇంజనీర్- 33
ఫోర్‌మెన్- 7
సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్- 14
లైన్‌ఇన్‌స్పెక్టర్- 41
లైన్‌మెన్- 77

అబ్బురపర్చిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళా


తమ ప్రదర్శనలతో మేళాకు హాజరైన విద్యార్థులు


ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు అందుకుంటున్న జడ్పీహెచ్ఎస్ ముత్యంపల్లి విద్యార్థులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : జనాభా పెరుగుదల, జీవనశైలిలో మార్పుల కారణంగా వస్తువుల వినియోగం ఎక్కువైందని, వినియోగానికి అనుగుణంగా వ్యర్థాల పునర్ వినియోగంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో శనివారం సైన్సు కేంద్రంలో నిర్వహించిన మేళాలో డీఈవో యాదయ్యతో కలిసి పాల్గొన్నారు. వ్యర్థం నుంచి అర్థం అనే అంశంపై నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ జిల్లా స్థాయి మేళాలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల వ్యర్థాలను ఉపయోగించి విద్యార్థులు రూపొందించిన అలంకరణలు ఆకట్టుకోగా డీఈవో, అదనపు కలెక్టర్ విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి అభినందించారు. 54 పాఠశాలల నుంచి విద్యార్థులు మేళాలో పాల్గొనగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, కన్సోలేషన్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రాష్ట్ర గ్రీన్ కోర్ కోఆర్డినేటర్ విద్యాసాగర్, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పాల్గొన్నారు.

విజేతలు :
ప్రథమ స్థానం : బిందుప్రియ, విశ్వసూర్య (జడ్పీహెచ్ఎస్, ముత్యంపల్లి కాసిపేట)
ద్వితీయ : రిషిత, రక్షిత (జడ్పీహెచ్ఎస్, ముల్కల్ల, హాజీపూర్)
తృతీయ : అంబిక, నక్షత్ర (కస్తూర్బా విద్యాలయం, జైపూర్, భీమారం)

లోక్ అదాలత్‌లో 4000 కేసుల పరిష్కారం


కేసులు పరిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసులు

మంచిర్యాల న్యాయవిభాగం, ఏసీసీ, చెన్నూర్, న్యూస్‌టుడే : పరస్పర రాజీమార్గం ద్వారా సత్వర న్యాయం పొందాలంటే జాతీయ లోక్ అదాలత్ సరైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు పేర్కొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టులో న్యాయమూర్తి పలు కేసులను పరిష్కరించారు. ఆయా కోర్టుల్లో 8 ప్రత్యేక బెంచీలు ఏర్పాటు చేసి నిర్వహించిన ఈ కార్యక్రమానికి కక్షిదారుల నుంచి స్పందన లభించింది. మొత్తం 4,000 కేసులను పరిష్కరించారు. 94 బ్యాంకు సంబంధిత కేసుల్లో రూ.38.31లక్షలు, 13 సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.1.18 లక్షలు రికవరీ చేశారు. మోటార్ ప్రమాద బీమా కేసులల్లో రూ.2.18 కోట్ల పరిహారాన్ని చెల్లించారు. న్యాయమూర్తులు అర్పితామారంరెడ్డి, సంపత్, నిరోష, ఉపనిషధ్వని, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరం


రేబిస్ వ్యాధి నివారణ టీకాల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : వీధి కుక్కల కారణంగా వ్యాప్తి చెందే రేబిస్ వ్యాధి పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పాలనాధికారి కుమార్‌దీపక్ అన్నారు. అంతర్జాతీయ రేబిస్ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులకు సమయానుసారంగా రేబిస్ నివారణ వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. కుక్కల పునరుత్పత్తిని నివారించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పురపాలక సంఘాలు, పంచాయతీల పరిధిలో రోజుకు 40 నుంచి 50 వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కుక్కలకు వేసిన రేబిస్ నివారణ టీకాల పంపిణీని పరిశీలించారు. జిల్లా పశువైద్యాధికారి డా.శంకర్, పురపాలక సంఘం కమిషనర్ మారుతిప్రసాద్, మంచిర్యాల పశువైద్యాధికారి డా.శంకర్ లింగం తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

బాధితులకు నమ్మకం కల్పించాలి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం బాధితులకు కల్పించాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పిటిషన్లు, వాటి రికార్డులను తనిఖీ చేశారు. నమోదు చేసిన కేసుల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఫిర్యాదుదారులతో ఎలా ప్రవర్తిస్తున్నారు, అదృశ్యం, నేర కేసుల్లో ఆధారాల సేకరణ వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచాలన్నారు. డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

తుది పంచాయతీ ఓటరు జాబితా ప్రదర్శన


వేంపల్లి పంచాయతీ కార్యాలయం గోడపై తుది ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న పంచాయతీ సిబ్బంది

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలోని 310 పంచాయతీల్లో శనివారం పంచాయతీ అధికారులు తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా అర్హులైన ఓటర్ల పేర్లతో ముసాయిదా ఓటరు జాబితాలను ఈ నెల 13న ప్రజలకు అందుబాటులో ఉంచారు. వీటిపై 1,955 రకాలైన అభ్యంతరాలు, ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించిన అధికారులు జాబితాల్లో అవసరమైన మార్పులు, చేర్పులు చేసిన అనంతరం తుది జాబితాలను విడుదల చేశారు. జిల్లాలో 16 మండలాల్లో 311 పంచాయతీలు ఉండగా 310 పంచాయతీల్లో తుది ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. దండేపల్లి మండలంలోని వందురుగూడ పంచాయతీలో గ్రామస్థుల నిరాకరణతో జాబితాల ప్రదర్శన చేయలేదని అధికారులు తెలిపారు. జిల్లాలో 3,78,912 మంది ఓటర్ల పేర్లతో సవరించిన ఓటరు జాబితాలను ఆయా పంచాయతీ కార్యాలయాల గోడలపై అంటించారు.

30న జోనల్ స్థాయి ఎంపిక పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య ఈ నెల 30న అండర్-14, 17 బాలబాలికల విభాగంలో జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) ఫుట్‌బాల్ (బొక్కలగుట్టలోని హెవెన్ ఆఫ్ హోప్ పాఠశాల), రెజ్లింగ్ (బాలికల గురుకుల పాఠశాల, లక్షెట్టిపేట) ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ప్రతిభచాటిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి ఇబ్బందులకు ఇక చెల్లు

★ సహాయకులకు వచ్చే నెల 7 వరకు శిక్షణ

జిల్లా వివరాలు	
గ్రామ పంచాయతీలు: 311	గ్రామ మంచినీటి సహాయకులు: 340


కన్నాల ఎంపీడీఓ కార్యాలయంలో చేతిపంపు మరమ్మతులపై శిక్షణ ఇస్తున్న శిక్షకుడు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో తరచూ తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. చేతిపంపులు, మోటార్లు పాడైతే రోజుల తరబడి వేచి చూడాలి. తాగునీటి సరఫరాలో ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తాగునీటి నాణ్యత పరిశీలనతోపాటు, బోర్లు, మోటార్లు పాడైపోతే అదే రోజు మరమ్మతులు కొనసాగేలా గ్రామ మంచినీటి సహాయకులను నియమించింది. ప్రతి గ్రామానికి(మేజర్ పంచాయతీలకు ఒకరి కంటే ఎక్కువ) ఒకరు బహుళ నైపుణ్యం కలిగిన కార్మికుల(మల్టీ స్కిల్డ్ వర్కర్స్)ను జిల్లా వ్యాప్తంగా 340 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'నల్ జల్ మిత్ర' పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మిషన్‌భగీరథ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తోంది.

మెరుగుపడనున్న సరఫరా

అర్హతల ఆధారంగా గ్రామ మంచినీటి సహాయకులను నియమించారు. వీరికి ప్రత్యేకంగా జీతభత్యాలు ఉండవు. గ్రామాల్లో చేతిపంపులు, మోటార్ల మరమ్మతులు, పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టడం, మంచినీటి నాణ్యత పరిశీలన, ట్యాంకులను శుభ్రం చేయడం వంటి పనులు చేయాలి. వీటికి అయ్యే ఖర్చులను పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేయాల్సి ఉంటుంది.

మూడు విడతల్లో..

జిల్లాలో మూడు విడతల్లో శిక్షణ ఇస్తున్నారు. మొదటి విడత ఇప్పటికే పూర్తయింది. రెండో విడత ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 2 వరకు, మూడో విడత వచ్చే నెల 3వ తేదీ నుంచి 7 వరకు ఇస్తారు. మొదటి విడతలో 8 మండలాలు, రెండు, మూడు విడతల్లో నాలుగు మండలాల చొప్పున శిక్షణ కొనసాగనుంది. ఈ నెల 13న హైదరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మాస్టర్ శిక్షకులకు శిక్షణ ఇచ్చారు. వీరంతా జిల్లాలోని మండలాల స్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.


త్వరలోనే అందుబాటులోకి సేవలు



- జి.వెంకటేష్, ఈఈ, మిషన్‌భగీరథ ఇంట్రా డివిజన్

గ్రామాల్లో మంచి నీటి సహాయకుల నియామకంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తప్పుతాయి. వీరికి ప్రతి పనిని తామే చేసుకునేలా నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఇక రోజుల తరబడి తాగునీటి సరఫరా నిలిచిపోయే ఆస్కారం ఉండదు. త్వరలో వీరి సేవలు గ్రామాల ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.





2024 నినాదం 'యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్'. 2025 నాటికి గుండె జబ్బు మరణాలను కనీసం 25 శాతం తగ్గించాలనే ఉద్దేశంతో ఈ విషయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను విస్తృతంగా ప్రచారం చేయటానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది ఇచ్చిన నినాదం ఇది.

రక్తం పోటెత్తి.. గుండె లయతప్పి

- పెరుగుతున్న బాధితులు
- నేడు 'ప్రపంచ హృదయ దినోత్సవం'

ప్రస్తుత జీవన విధానం, మానసిక ఒత్తిడి, మారిన ఆహారపు అలవాట్లతో ఉమ్మడి జిల్లాలో గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే వారి సంఖ్య పెరిగిపోతోంది. ప్రధానంగా మానసిక ఒత్తిడి కారణంగా రక్తపోటు(బీపీ) పెరిగి గుండె లయతప్పి మృత్యువాత పడుతున్న బాధితులు పెరిగిపోతున్నారు. బీపీ బారిన పడ్డ వారికి మధుమేహం, థైరాయిడ్ సమస్యలు ఏర్పడి అవి గుండెపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఇది వరకు జబ్బులు వారు అప్పుడప్పుడు మాత్రమే ఆయాసంతో కనిపించేవారు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు, బీపీ, మధుమేహం బారిన పడుతున్నారు. రక్తపోటు వంశ పార్యంపరంగా కూడా వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. దీని బారిన పడ్డ వారు మధుమేహం, థైరాయిడ్‌కు గురయ్యే అవకాశాలుంటాయంటున్నారు. యుక్త వయస్కుల్లో సాధారణ బీపీ 120(సిస్టోలిక్), 80(డయస్టోలిక్) ఉండాలి. రక్తపోటు వచ్చిన వారికి గుండె జబ్బుల ముప్పు పొంచి ఉందంటున్నారు.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం

తల్లి గర్భంలో నెల శిశువుగా ఉన్నప్పుడే గుండె స్పందన ప్రారంభమై మనిషి మృతి చెందే వరకు రెప్పపాటు కాలం కూడా ఆగకుండా పని చేస్తుంది. కేవలం కొన్ని నిమిషాలు గుండె పని చేయటం మానేస్తే జీవితం అంతం అయిపోతుంది. అందుకే గుండెను ఆరోగ్యంగా కాపాడుకుంటేనే జీవించి ఉండగలుగుతాం. ప్రజలంతా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబరు 29న 'ప్రపంచ హృదయ దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1.87 లక్షల మంది బాధితులు

ఆదిలాబాద్	నిర్మల్	కుమురం భీం	మంచిర్యాల
32,995	75,563	19,003	60,071

● జిల్లా ● రక్తపోటు బాధితులు

లక్షణాలుంటే వైద్యుడిని సంప్రదించాలి



– కస్తూరి శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్, రిమ్స్

గుండె సంబంధిత వ్యాధులు, బీపీ లక్షణాలు ఏమాత్రం ఉన్నా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా నిర్ణీత సమయంలో మందులు వాడాల్సి ఉంటుంది. లేకుంటే ప్రాణాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. రోజూ కాసేపు వ్యాయామం చేస్తే వీటి ముప్పును చాలా వరకు తగ్గించుకోవచ్చు.

ఇబ్బందులను నిర్లక్ష్యం చేయొద్దు



– రాజేశ్, గుండె వైద్యనిపుణులు, మంచిర్యాల

ఛాతి పై ఒత్తిడి, అసౌకర్యం, కళ్లు, నొప్పులు, చేతుల్లో అలసట, చెమటలు పట్టడం, తల తిరగడం, వేగంగా గుండె కొట్టుకోవడం ఇలా ఏలాంటి లక్షణాలు కలిగినా వెంటనే సంబంధిత వైద్యుడిని సంప్రదించడం అవసరం. వీటిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా పరిణామాలు తీవ్రంగా ఉండటమే కాకుండా ప్రాణహాని ఉండే అవకాశం ఉంది. ఏ చిన్న ఇబ్బంది తలెత్తినా అశ్రద్ధ చేయవద్దు. జీవనశైలి, ఆహార అలవాట్లు ఆరోగ్యకరంగా ఉంచుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవి..

- అనునిత్యం శారీరక శ్రమ ఉండాలి, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి
- అధిక పోషియం ఆహారం (ఆకుకూరలు, కూరగాయలు) తీసుకోవాలి.
- నూనె పదార్థాలు, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండటం మంచిది
- ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలి
- ఉప్పు అధికంగా వాడొద్దు
- రోజూ 8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలి.
- ఏదైనా తీవ్ర ఒత్తిడికి గురైతే ఉపశమనం కోసం క్రీడలు, ఇతర వ్యాపకాలపై దృష్టి సారించాలి

ఎరుపెక్కిన అంబరం.. చూపరులకు సంబరం



కారుమబ్బులు చీల్చుకుంటూ సూర్యోదయం వేళ భానుడి అరుణ కిరణాలతో ఆకాశం ఎరుపెక్కింది. మబ్బుల్నీ ఎరుపు వర్ణాన్ని సంతరించుకొన్న అంబరం చూపరులకు సంబరాలను నింపి ప్రకృతి రమణీయతను చాటింది. మెల్లమెల్లగా సూర్యుడు బయటకు రావడంతో ఆకాశం ఎరుపు వర్ణాన్ని వీడి నీలం రంగులోకి మారింది. నింగిలో ఈ సుందర దృశ్యం ఖానాపూర్, భైంసా మండలం ఇలేగాం, తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 5:30 తర్వాత ఆవిష్కృతమైంది. తెల్లవారుతోనే ప్రజలకు కనువిందు చేసింది.

– ఖానాపూర్, భైంసా, న్యూస్‌టుడే

నరభక్షక పులి చేజిక్కే..



స్పృహ కోల్పోయిన టీ-83 పులి వద్ద అటవీ అధికారులు

బల్లార్ష, న్యూస్‌టుడే : మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా మూల్ తాలూకా చిచ్‌పల్లి అటవీక్షేత్రంలో నలుగురిని హతమార్చిన టీ-83 అనే పులిని శనివారం అటవీశాఖ అధికారులు బంధించారు. జనాలా, కాంతాపేట్, చిరోలీ, కేలా దోమేట్, చింఛాల తదితర గ్రామ పరిసరాల అడవుల్లో సంచరిస్తూ పదిహేను రోజుల్లో నలుగురు పశువుల కాపరుల ప్రాణాలు తీసింది. దీంతో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. రాష్ట్ర అటవీశాఖ మంత్రి మునగంటివార్ జిల్లా పులిని వెంటనే పట్టుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఈక్రమంలో అధికారులు అడవిలో పలుచోట్ల బోనులు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు అమర్చారు. ఈ ప్రయత్నాలు విఫలం కావడంతో డ్రోన్ సాయంతో శనివారం జనాలా గ్రామ పరిసర అడవుల్లో సంచరిస్తుండగా గుర్తించారు. ప్రముఖ షూటర్ అజయ్ మరాఠే సాయంతో పులికి మత్తుమందు ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేశారు. అధికారులు పశువైద్యాధికారి రవికాంత్ ఖోబ్రగడే పరిశీలించిన తర్వాత దాన్ని చంద్రపూర్ రెస్క్యూ సెంటర్‌కు తరలించారు.

పుస్తకాల కింద పాము..



కౌటాల, న్యూస్‌టుడే : కౌటాల మండలంలోని కన్నెపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పాము కలకలం సృష్టించింది. ఉదయం వచ్చిన విద్యార్థులు తరగతి గదిలో కూర్చొని ఉండగా పుస్తకాల కింద పాము ఉండటంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు వెంటనే స్పందించడంతో స్థానికుల సహాయంతో దాన్ని చంపారు. ప్రహరీ గోడ లేకపోవడంతో తరచూ బడి ఆవరణలోకి విషపురుగులు వస్తున్నాయని ప్రధానోపాధ్యాయురాలు అనూష తెలిపారు.

తిరుపతి ఘటనపై న్యాయవిచారణ జరపాలి : వీహెచ్‌పీ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతిలో లడ్డూ ప్రసాదంలో కల్తీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విలాస్ డిమాండ్ చేశారు. నిర్మల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలియుగదైవంగా భక్తులు పూజించే ఆలయంలో అపవిత్ర పనులు చేసుకోవడం బాధాకరమన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే ఈ చర్యలను ఉపేక్షించొద్దని హెచ్చరించారు. దేవాదాయశాఖను రద్దుచేసి, ధార్మిక వ్యక్తులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 30న నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. బజరంగ్‌దళ్ విభాగ్ ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ పతికె రాజేందర్, జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభాకర్, సాదం ఆనంద్, పతికె రమేశ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకుంటే కిడ్నీలు అమర్చుతాం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : డయాలసిస్ బాధితులు దరఖాస్తులు చేసుకుంటే లభ్యతను బట్టి ఉచితంగా నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీలను జీవన్‌దాన్‌లో భాగంగా అమర్చే ఏర్పాటు చేస్తామని హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ వైద్యుడు కార్తిక్ పేర్కొన్నారు. ఆయనతో పాటు నిమ్స్ మరో నెఫ్రాలజిస్ట్ శశాంక్‌లు రిమ్స్ డయాలసిస్ కేంద్రాన్ని శనివారం సందర్శించి పరిశీలించారు. జీవన్‌దాన్ గురించి అవగాహన కల్పించారు. రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్, అపెక్స్ క్వాలిటీ మేనేజర్ జీవన్, కేంద్రం బాధ్యుడు ప్రేందాస్ సిబ్బంది ఉన్నారు.



రిమ్స్‌లోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నిమ్స్ ఆసుపత్రి వైద్యులు

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం



రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి



RAMOJI® FILM CITY

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

- నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణంలోని ఒక కాలనీలో మూడేళ్ల చిన్నారిపై దాదాపు 45 సంవత్సరాల వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన శనివారం వెలుగు చూసింది. అదే కాలనీకి చెందిన నంద కుమార్ అనే వ్యక్తి మరుగుదొడ్డిలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు చిన్నారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు.

సిమెంటు ఇటుకలతో.. మనసుదోచే శిల్పాలు

- విశ్రాంత ఉద్యోగి కళారాధన

ఈటీవీ - ఆదిలాబాద్ :

అయోధ్యలో కొలువుదీరిన రాంలల్లా. శాంతిని ప్రబోధించే గౌతముడు. హంపినగర శిల్ప సౌందర్యం. కాకతీయ సామ్రాజ్య కళా వైభవం. అన్నీ ఒకే చోట కొలువైతే. ఎంత బాగుంటుంది. దాన్ని సుసాధ్యం చేశారో విశ్రాంత ఉద్యోగి. ఆరు పదుల వయసులో తనలో దాగి ఉన్న శిల్పకళను తట్టిలేపారు. మనసును మంత్రముగ్ధులను చేసే ఎన్నో కళాకృతులకు జీవం పోశారు. కళారాధనంటే వ్యాపార దృక్పథం కాదు. మనసును తేలిక పర్చుకోవడమనేలా సాగుతున్న శిల్ప కళా సౌందర్యంపై 'ఈటీవీ - ఈనాడు' ప్రత్యేక కథనం.





ప్రతిమలను చెక్కుతున్న కేవీరావు

ఆదిలాబాద్‌లోని జీఎస్ కాలనీలో నివాసం ఉండే కె.జ్యోతిశ్రీ-కేవీ రావు దంపతులది సాధారణ మధ్య తరగతి కుటుంబం. సిమెంటు పరిశ్రమ విశ్రాంత ఉద్యోగి అయిన కేవీరావుకు చిన్నప్పటి నుంచి కళలంటే అమితమైన ఆసక్తి. కరోనా సమయంలో తన కళా నైపుణ్యానికి పదును పెట్టారు. మార్కెట్లో లభించే సిమెంటు ఇటుకలను కొనుగోలు చేసి శిల్పాలుగా మలచడం ప్రారంభించారు. సుద్దముక్కలను శిల్పాలుగా తీర్చిదిద్దేందుకు యత్నించారు. ఎన్నోసార్లు విఫలయ్యారు. సుద్దముక్కలు, ఇటుకలు విరిగిపోయాయి. వినియోగించిన చిన్నపాటి ఉలి, రంపంతో చేతివేళ్లకు గాయాలయ్యాయి. అయినా పట్టువీడలేదు. ఆలోచనను విరమించుకోలేదు. ఎన్నో అబ్బురపరిచే కళాకృతులకు ప్రాణం పోశారు. చూపరులను మంత్రముగ్ధులను చేసే శిల్పాలను తీర్చిదిద్దారు. ఆయన ఇంట్లోని ఓ గది చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని తట్టిలేపే ఎన్నో శిల్పాలతో నిండిపోయి ఉందంటే ఆశ్చర్యం వేయకమానదు.

చిత్రం విచిత్రమే..

ఆరు అంగుళాల సుద్దముక్క నుంచి మొదలుకొని రెండు అడుగుల వరకున్న తేలికపాటి సిమెంటు ఇటుకలే ముడిసరకుగా బొమ్మలుగా చెక్కడంలో ఆయన దిట్ట. ఇటుకపై తయారు చేసిన బుద్ధుడి బొమ్మను చూస్తే హుస్సేన్‌సాగర్‌లో ఉన్న ప్రతిమ చిత్రంగా అనిపిస్తుంది. రెండు అంగులాల సుద్దముక్కపై చెక్కిన శివాజీ ముఖాన్ని చూస్తే చాలు ఆశ్చర్యం వేయకమానదు. దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, నాట్యభంగిమలు, ఏనుగులు, గుర్రాలతో కూడిన శిల్ప సౌందర్యం, సింగపూర్ రాజముద్ర, గోడలకు అతికించేలా దేవతాప్రతిమలు, టీవీ స్టాండ్లు ఇలా ఎన్నో ఆకృతులకు ప్రాణం పోస్తున్నారు.

స్నేహితులకు, బంధువులకు బహుమతులుగా..

తయారు చేసిన శిల్పాల క్రయవిక్రయాలకు ప్రాధాన్యం ఇవ్వరు. వివాహాలు, ఇతర శుభ కార్యాల్లో బహుమతులుగా అందజేస్తారు. స్నేహితులకు బహుమానంగా ఇస్తారు. ఇటుకలు కొనిచ్చి తమకు కావాల్సిన ప్రతిమను తయారుచేయమని మిత్రులు అడిగితే ఉచితంగానే చేసి ఇస్తారు. నేను ఎంచుకున్న కళారాధన వ్యాపారం కోసం కాదు. మానసిక ఆనందం కోసమే. సతీమణి జ్యోతిశ్రీ ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని కేవీరావు చెబుతుంటారు.



తయారు చేసిన శిల్పాలతో కేవీరావు దంపతులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

చెన్నూరు, న్యూస్‌టుడే:

? చెన్నూరు పట్టణంలోని లైబ్రరీ నుంచి జెండా వీధికి వెళ్లే మార్గంలో ఉండే గల్లీలో రహదారికి అడ్డంగా పిచ్చిమొక్కలు పెరిగాయి. - పులి రామన్న, విశ్రాంత ఉపాధ్యాయుడు

✔ ప్రాంతాన్ని సందర్శించి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. - రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, చెన్నూరు మున్సిపాలిటీ

నస్పూర్, న్యూస్‌టుడే :

? సీసీసీ కార్నర్ బస్టాండ్ వద్ద శౌచాలయం లేక ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు

✔ త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - సతీష్, నస్పూర్ పుర కమిషనర్

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని కాల్‌టెక్స్ రైల్వే ప్లైవంతెన వద్ద కింద రైల్వే క్వార్టర్స్ వద్ద అప్రోచ్ రోడ్డు గుంతలమయంగా మారింది. గుంతలు పూడ్చాలి. - రమేష్, కాల్‌టెక్స్

✔ ఇటీవల వరద నీరు రావడంతో గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు పూడ్చేలా చర్యలు చేపడతాం. - సందీప్, మున్సిపల్ ఏఈ

16 ఏళ్ల నిరీక్షణ ఫలించె..

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:

ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ-2008 అభ్యర్థుల విషయంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల వారికి ఎట్టకేలకు ఊరట లభించింది. 2008లో నిర్వహించిన డీఎస్సీలో పరీక్షా నియామకాల్లో అప్పటి ప్రభుత్వం 30 శాతం డీఈడీ అభ్యర్థులకు కేటాయించారు. దీంతో బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. డీఈడీ అభ్యర్థుల కన్నా ఎక్కువ మార్కులు వచ్చినా కొలువు దక్కలేదు. అప్పటి నుంచి వారంతా న్యాయ పోరాటం చేస్తున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నష్టపోయిన అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో (ఎస్జీటీ) సెకండరీ గ్రేడ్ టీచర్లు)గా నియమించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో 135 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ప్రభుత్వం నియమించనున్న వారికి నెలకు 31,080 వేతనం ఇవ్వాలని నిర్ణయించింది. 2008 డీఎస్సీ బాధితులు 135 మంది ఉన్నా.. వారిలో కొంత మంది తర్వాత నిర్వహించిన ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు, మంచి వేతనంతో ప్రైవేటు ఉద్యోగాలు, ఇతర వ్యాపారాలు, రంగాల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం చేస్తున్న వ్యాపారాలు, రంగాలు, వృత్తులను వదిలి కొలువులో ఎంత మంది చేరుతారో వేచి చూడాల్సి ఉంది.

చిగురించిన ఆశలు



గోపతి శ్రీనివాస్, వెంకట్రావ్‌పేట, లక్సెట్టిపేట మండలం

మాది లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామం. 2008లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించా. అప్పటి ప్రభుత్వం 30 శాతం డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో ఉద్యోగం కోల్పోయా. అయినా నిరాశ చెందకుండా ప్రభుత్వ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుడిగా చేరాను. 2023లో మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించారు. ప్రస్తుతం మంచిర్యాల ప్రభుత్వం కళాశాలలో రెగ్యులర్ జూనియర్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నాను. 2008 డీఎస్సీ అభ్యర్థుల విషయంలో సర్కారు తాజా నిర్ణయంతో నా తోటి స్నేహితుల ఆశలు చిగురించాయి.

ఆశ వదులుకున్నా..



- మల్లారెడ్డి, సిర్సా, కోటపల్లి మండలం

మాది కోటపల్లి మండలం సిర్సా గ్రామం. ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేశా. డీఎస్సీలో చివరి నిమిషంలో ఉద్యోగం చేజారింది. ఇక ఉద్యోగంపై ఆశలు వదులుకున్నాను. ప్రస్తుతం హైదరాబాదులో వ్యాపారం చేసుకుంటున్నాను. సర్కారు హామీని నిలబెట్టుకుని కాంట్రాక్టు పద్ధతిలో కొలువులు ఇవ్వాలని నిర్ణయించడం ఆనందంగా ఉంది.

న్యాయం జరిగింది: మేక రమేశ్, మంచిర్యాల



మాది మంచిర్యాల పట్టణం. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఉద్యోగం చేస్తున్నా. మా ఉద్యోగాల విషయంలో 16 ఏళ్లుగా న్యాయ పోరాటం చేశాం. చివరకు న్యాయం జరిగింది. సంతోషంగా ఉన్నా.. ప్రభుత్వం చెప్పిన వేతనం విషయంలో అసంతృప్తిగా ఉంది. ఇన్నేళ్ల సర్వీసు కోల్పోయాం. రూ.31 వేల వేతనానికి బదులుగా నెలకు రూ.50 వేలు ఇస్తే బాగుంటుంది. ప్రభుత్వం మా వేతనాల విషయంలో ఆలోచించుకోవాలి.

కార్యకలాపాలకు దూరంగా కాంగ్రెస్ నాయకులు

చెన్నూరు పట్టణం: కాంగ్రెస్‌ను మత్తిడి పెల్లిన వ్యవహారం చెన్నూరు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపుతోంది. ఈ ఘటనలో పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గోడిసెల బాపురెడ్డి, పెద్దింటి శ్రీనివాస్ ప్రమేయం ఉందని కోణంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేసి వదిలేశారు. విచారణ పేరిట పోలీసులు ఇళ్లకు వచ్చి తీసుకెళ్లిన తీరుపై కాంగ్రెస్ నాయకులు మనస్తాపానికి గురయ్యారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శనివారం చెన్నూరు క్యాంపు కార్యాలయానికి రాగా చెన్నూరు పురపాలికతో పాటు చెన్నూరు, కోటపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దూరంగా ఉన్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు సైతం కార్యక్రమానికి హాజరుకాలేదు.

బంధువుల ఇంటికి వెళ్లి వస్తూ యువకుడి మృతి

జైపూర్, న్యూస్‌టుడే : బంధువుల ఇంటికి వచ్చి తిరిగివెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని రైల్వే వంతెన వద్ద గల జాతీయ రహదారి మీద చోటుచేసుకుంది. అదనపు ఎస్సై నాగరాజు కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన సిర్ర చంద్రయ్య- కనకవ్వ దంపతుల కుమారుడు, ప్రవీణ్(25) సంతానం. మృతుడు ప్రవీణ్ తన స్నేహితుడు పొన్నం అజయ్‌తో కలిసి మద్యాహ్నం ద్విచక్రవాహనంపై మంచిర్యాలకు వచ్చారు. పని ముగించుకొని రాత్రిపూట బంధువుల ఇంటి నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం ఇందారం వద్ద రోడ్డు దాటుతున్న గేదెను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందారు. అజయ్‌కు తీవ్రగాయాలవడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అలాగే ప్రమాదం దాటికి ఒక గేదె మరణించగా మరొక దానికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్సై తెలిపారు.



ప్రవీణ్

వ్యభిచార గృహాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని వ్యభిచార గృహాలపై శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. సంతోష్‌నగర్, సాయికుంటలోని పలు నివాసాలను అద్దెకు తీసుకుని ఈ వ్యవహారం నడిపిస్తుండగా నిర్వాహకులు, విటులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. ఆయా వ్యక్తులను మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పేర్కొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో చిన్నారికి గాయాలు

భీమిని, న్యూస్‌టుడే: మండలంలోని ఖర్జిభీంపూర్ గ్రామంలో శనివారం పిచ్చికుక్క దాడిలో నాలుగేళ్ల బాలిక ఆనందికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఠాకూర్ గోపాల్ సింగ్, లక్ష్మీబాయి దంపతుల నాలుగేళ్ల కూతురు ఆనంది ఇంటి ముందర ఆడుకుంటోంది. ఈ క్రమంలో పిచ్చికుక్క దాడి చేయడంతో తల్లి లక్ష్మీబాయి తరిమికొట్టడంతో విడిచిపెట్టింది. అనంతరం ఎస్టీ కాలనీకి చెందిన టేకం గోపాల్ కూతురు ఏడేళ్ల చిన్నారి అక్షిత, ఆవుపై దాడి చేసింది. అక్షితకు ముఖం, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే ఇద్దరు చిన్నారులను మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు.

యువకుడి మృతికి కారణమైన ఆర్ఎంపీ అరెస్ట్

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: తెలిసీ తెలియని వైద్యంతో యువకుడి మరణానికి కారణమైన ఆర్ఎంపీ బొడ్డు శ్రీనివాస్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు సీఐ అల్లం నరేందర్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బత్తుల మధూకర్ జ్వరంతో బాధ పడుతుండగా తండ్రి రాజలింగయ్య ఆసుపత్రికి తీసుకెళ్లడంపై ఆర్ఎంపీ బొడ్డు శ్రీనివాస్‌ను సలహా కోరాడు. ఆర్ఎంపీగా చలామణి అవుతున్న శ్రీనివాస్ వైద్య వృత్తిలో కనీస అర్హత లేకున్నా, చట్టరీత్యా మెడికల్ ప్రాక్టీషనర్‌గా ఆయన పేరు ఎక్కడా నమోదు కాకున్నా మధూకర్‌ను పరీక్షించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయకుండానే ఆయనకు మూడు ఇంజక్షన్లు గ్లూకోజులో కలిపి ఇచ్చాడు. అది వికటించడంతో మరో ఇంజక్షన్ నడుముకు ఇచ్చాడు. పరిస్థితి చేయిదాటగానే ఏదైనా పెద్దాసుపత్రికి తీసుకువెళ్లాలని చెప్పాడు. రాజలింగయ్య తన కొడుకుని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ మధూకర్ జీవన్మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఆర్ఎంపీ శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు ఆయన వివరించారు.

క్షేత్ర సందర్శనలో డిగ్రీ విద్యార్థులు

బెల్లంపల్లి పట్టణం : ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాలనా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్షేత్ర సందర్శనకు వెళ్లారు. పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అన్ని విభాగాలను పరిశీలించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ఉత్తర్వులు సవరించాకే సర్దుబాటు చేయాలి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులను సవరించాలని, బదిలీలు, పదోన్నతుల్లో అన్యాయం జరిగిన అప్పీళ్లను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవో 25ను సవరించాకే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలన్నారు. తదితర సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాజవేణు, రమేష్, జయకృష్ణ, నాగలక్ష్మి, కిరణ్, చిలుక పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని నిరసన

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కన్నాలబస్తీ తెదేపా గ్రంథాలయ స్థలాన్ని ఆక్రమించిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలంటూ శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యాలయం స్థలాన్ని కబ్జా విషయం అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తప్పుడు ధ్రువపత్రాలతో ఇంటి నంబరు కేటాయించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. స్థలాన్ని కబ్జా చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని అజయ్ అనే వ్యక్తి బెదిరింపులకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. గ్రంథాలయం స్థలం అప్పగించకపోతే జిల్లా పాలనాధికారి కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి టి.మణిరామ్‌సింగ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గద్దల నారాయణ, పట్టణ మాజీ ఉపాధ్యక్షుడు బొల్లు మల్లయ్య, నాయకులు గోపాల్, తిరుపతి, నవీన్, యాదగిరి పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తెదేపా నాయకులు

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీలో జరిగిన పీఎస్బీ మెట్‌లైఫ్ జేబీసీ రాష్ట్ర స్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి ప్రతిభ చాటింది. అండర్-17 విభాగంలో అనన్య ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి హాజరై మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు కాంస్య పతకాన్ని అంతర్జాతీయ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి చేతులమీదుగా స్వీకరించినట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ శనివారం తెలిపారు.

యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

నెన్నెల, నస్పూర్, న్యూస్‌టుడే: యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని బెల్లంపల్లి సీఐ అఫ్జలొద్దీన్ అన్నారు. శ్రావణపల్లి గ్రామంలో శనివారం నెన్నెల పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రామ్‌లో పాల్గొని మాట్లాడారు. అనంతరం అనుమతి లేని వాహనాలను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. గ్రామంలో తయారీ చేస్తున్న 12 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 150 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు చెప్పారు. శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

పంచాయతీ కార్మికులకు ప్రమాద బీమా

కన్నెపల్లి, న్యూస్‌టుడే: కన్నెపల్లి మండలంలోని అన్ని పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు భీమిని వైద్యులు కుమారస్వామి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రతి కార్మికునికి తపాలా శాఖలో పదిహేను లక్షల ప్రమాద బీమా చేశారు.

ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి గ్రామీణం : దండేపల్లి మండలం కొత్తమామిడిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి లింగన్నకు శనివారం రూ.2,50,000 ఎల్‌వోసీని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అందజేశారు.

హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో హోమం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కలియుగదైవం తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామికి అత్యంత ఇష్టమైన లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడంతో ప్రాయశ్చిత్తం కోసం హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. పట్టణంలోని సుభాష్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఐక్యవేదిక నాయకులు, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, సేవాదళ్, హిందూ ఉత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు

మందమర్రి పట్టణం: తిరుపతి దేవస్థానంలో లడ్డూ కల్తీ చేయడాన్ని నిరసిస్తూ శనివారం మందమర్రిలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు ఆందోళన నిర్వహించారు. ముందుగా అంగడిబజార్ శివకేశవ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గోవింద నామాల కీర్తనలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. ప్రకులు క్షీరాభిషేకం చేశారు.

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన

జన్నారం: మండలంలోని పొనకల్ రైతు వేదికలో సోమవారం (30న) పట్టు పురుగుల పెంపకం, మల్బరీ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లుగా పట్టు పరిశ్రమశాఖ మంచిర్యాల జిల్లా సహాయ సంచాలకురాలు పార్వతి తెలిపారు.

సమన్వయంతోనే అభివృద్ధి పరుగులు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : చెన్నూరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి ఇంట్లో కుళాయి ఏర్పాటు చేసి మిషన్ భగీరథ నీటిని నిరంతరాయంగా అందించాలని, నీటి అవసరాలను తీర్చే మోటార్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సక్రమంగా పనిచేయాలన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ , ఎమ్మెల్యే

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

మందమర్రి పట్టణం, మంచిర్యాల పట్టణం, ఏసీసీ, బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా భగత్‌సింగ్ జయంతిని యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యం రావడానికి చిన్న వయసులోనే భగత్ సింగ్ చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు.



మంచిర్యాలలో సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు



జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



బెల్లంపల్లిలో ..

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : క్యాతనపల్లి పురపాలికలోని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఉదయపు నడకలో భాగంగా శనివారం ఎమ్మెల్యే అమరవాది గ్రామంలో పర్యటించారు. కాలనీలలో పర్యటిస్తూ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 21వ వార్డు కౌన్సిలర్ పార్వతి విజయ కాంగ్రెస్‌లో చేరగా ఆమెకు ఎమ్మెల్యే కండువా వేసి ఆహ్వానించారు.

జైపూర్, భీమారం, చెన్నూరు పట్టణం : ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు సంక్షేమ ఫలాలు అంది న్యాయం జరుగుతుందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మహాలక్ష్మీ పథకం లబ్ధిదారులకు ధ్రువపత్రాలతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. తహసీల్దార్ వనాజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపు, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. భీమారం రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి కల్పన, ఎంపీడీవో మధుసూదన్ నాయకులు పాల్గొన్నారు. కాగా మండల కేంద్రంలోని ఊర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో వచ్చే సుంకరిపల్లి వాసులు, రహదారి పక్కన టేలాలలోని చిరు వ్యాపారులు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌ను కలిసి తమ నివాసాలను, టేలాలను తొలగించవద్దని విన్నవించుకున్నారు.

వేతనాలు అమలు చేయాలి

ఏసీసీ, న్యూస్‌టుడే : కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్మికులతో కలిసి కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

జైపూర్, న్యూస్‌టుడే : పవర్‌మేక్ యాజమాన్యం విధుల్లోకి తీసుకోకపోవడంతో మనస్తాపం చెంది శుక్రవారం పురుగుల మందు తాగి మృతి చెందిన బాలకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని తోటి ఒప్పంద కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం మెయిన్ ప్లాంట్ ఆవరణలో బీఎంఎస్, హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీ సంఘాలకు చెందిన కార్మికులు నిరసన తెలిపారు. స్థానిక ఎస్సై శ్రీధర్‌తో పాటు పవర్‌మేక్ సంస్థ చెందిన పలువురు అధికారులు సంఘాలతో చర్చలు జరిపారు. మృతుడి కుటుంబానికి తోటి కార్మికుల నుంచి రూ.15 లక్షల ఆర్థిక సాయంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఇద్దరికి ఉద్యోగాలు ఇస్తామని పవర్‌మేక్ సంస్థ ప్రతినిధులు అంగీకరించి సంఘాలతో ఒప్పందాలు చేసుకున్నారు.

గీతకార్మికుల సంక్షేమమే ధ్యేయం

లక్షెట్టిపేట : గీతకార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని మున్సిపాలిటీలో కాంగ్రెస్ పక్ష నాయకుడు చెల్ల నాగభూషణం అన్నారు. శనివారం ఇటిక్యాల చెరువు కట్టపై ఈత మొక్కలను నాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్, కౌన్సిలర్లు సురేష్ నాయక్, ఉమాదేవి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బస్సులు ఆపాలని వినతి

మందమర్రి పట్టణం : మందమర్రి పురపాలిక కార్యాలయం ముందు నిర్మించిన బస్‌షెల్టర్ వద్ద ఆర్టీసీ బస్సులను నిలిపేలా చర్యలు చేపట్టాలని మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్ధన్‌కు బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ వినతిపత్రం అందజేశారు.

నూతన ఆలోచనలే గొప్పవాళ్లను చేస్తాయి

జైపూర్, న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచే వినూత్నంగా నూతన ఆలోచనలు చేస్తే భవిష్యత్తులో గొప్పవాళ్లను చేస్తాయని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టిక్కరింగ్ ప్రయోగశాలను జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ఎంఈవో శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు.

సంక్షిప్తం

ఎస్సీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

లక్షెట్టిపేట: జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మాదిగల మేలుకొలుపు యాత్రలో భాగంగా శనివారం లక్షెట్టిపేటకు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

మంచిర్యాల పట్టణం: ప్రభుత్వం జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణను చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు.

ఎన్నికల హామీకి కట్టుబడి ఉన్నాం

లక్షెట్టిపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి పని చేస్తోందని మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం అన్నారు. ఇటిక్యాల గ్రామంలో గృహజ్యోతి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

చెన్నూరు : ఎన్నికల హామీలను అమలుపర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి ఆరోపించారు. శనివారం స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో నిర్వహించిన పార్టీ చెన్నూరు ఏరియా మహాసభకు వారు హాజరై మాట్లాడారు.

కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం

మంచిర్యాల పట్టణం : కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్ అన్నారు మంచిర్యాలలో శనివారం సత్య శోదక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఓడబ్ల్యూ డివిజన్ కార్యదర్శి మంగ, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలించకుండా అడ్డగింత

నెన్నెల: మైలారం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను ఈ నెల 27న అధికారులు పంచనామ నిర్వహించి మైనింగ్ అధికారులకు అప్పగించారు. మైనింగ్ అధికారులు ఆన్‌లైన్ ద్వారా ఇసుక విక్రయించారు. అక్రమంగా నిల్వ చేసిన కొంత మంది ఇసుకను తరలించవద్దని అడ్డుకున్నారు. మైనింగ్ అధికారులకు అక్కడి వారికి వాగ్వివాదం జరిగింది. దీంతో ఎస్సై రంగ ప్రవేశం చేసి మైనింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఇసుకను తరలించడంతో సమస్య సద్దుమనిగింది.

ద్విచక్ర వాహనం దగ్ధం

కన్నెపల్లి : నాయికిన్‌పేట పంచాయతీ పరిధిలోని మొక్కపల్లిలో శనివారం ద్విచక్ర వాహనం దగ్ధమైంది. ఎస్సై గంగారం తెలిపిన వివరాల ప్రకారం.. మొక్కంపల్లి గ్రామానికి చెందిన గాదర్ల మహేష్ ద్విచక్ర వాహనం ఇంటి ఆవరణలో నిలిపి ఉంచిన సమయంలో ఒక్కసారిగా పేలిన శబ్దం వచ్చి మంటలు చేలరేగాయి. ఇంటిలో వాళు గమనించి బయటకు వచ్చేసరికి పూర్తిగా కాలిపోయింది. అదే సమయంలో గాదర్ల రాజేష్ అనే వ్యక్తి తన ఇంటి నుంచి పరుగెత్తడం బాధితుడి తల్లి చూసినట్లు ఎస్సై తెలిపారు.

రామాయణ మహా సదస్సులో జిల్లా వాసికి సన్మానం

తాండూరు: ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం పట్టణంలో జరుగుతున్న ప్రపంచ వ్యాప్త వాల్మీకి రామాయణ మహా సదస్సులో మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన వేద పండితుడు శ్యాంప్రణీత్ రామాయణంలోని పలు యజ్ఞాల గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా 40 మంది పండితులు వివిధ ప్రాంతాల నుంచి రామాయణంలోని పలు అంశాలపై ప్రసంగించి తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులు, రామనారాయణం ఆలయ వ్యవస్థాపకులు శ్యాంప్రణీత్‌శర్మను ఘనంగా సత్కరించారు.

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

హాజీపూర్: పంచాయతీల్లో నాణ్యతలేని ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నివారించేందుకు శనివారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చిరువ్యాపారస్థులు, దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. మండలంలోని వేంపల్లి, ముల్కల్ల, హాజీపూర్, దొనబండ, గుడిపేట, పడ్తనపల్లి, కర్ణమామిడి గ్రామాల్లోని చిరు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని సూచించారు.

తహసీల్దారు ముందు బైండోవర్

నెన్నెల: ఎమ్మెల్యే గడ్డం వినోద్‌పై సామాజిక మాధ్యమంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కొత్తూర్ గ్రామానికి చెందిన తలండి నగేష్‌ను తహసీల్దార్ రమేష్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి

దండేపల్లి: పాఠశాల విద్యకు పునాది అయిన ప్రాథమిక విద్యను ప్రభుత్వం విస్మరిస్తోందని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం సరైన పద్ధతి కాదని, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. శనివారం దండేపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన సముదాయ సమావేశంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

విద్యార్థుల నృత్యాలు.. తల్లుల ఆటలు

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దండేపల్లి మండలం మేదరిపేట ట్రిలియంటు కిడ్స్ పాఠశాలలో శనివారం మదర్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



మేదరిపేటలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న రామకృష్ణతో పాటు తల్లిదండ్రులు, కాలనీవాసులు

విజయోత్సవ ర్యాలీ

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : మందమర్రి కేకే5 గనిలో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా పనిచేస్తున్న తిరుపతి కుమారుడు రామకృష్ణ మహారాష్ట్రలోని డబ్ల్యూసీఎల్ సంస్థలో అండర్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించారు. ఉద్యోగం చేస్తూనే రెస్క్యూలో చేరి సేవలందించారు. ఈ క్రమంలో జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తూ ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు అమెరికాలో జరిగి రెస్క్యూ పోటీల్లో సత్తా చాటి జట్టును రెండోస్థానంలో నిలిపారు. శనివారం మందమర్రికి వచ్చిన రామకృష్ణకు స్థానికులు, కాలనీ వాసులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. మార్కెట్ నుంచి కార్మికవాడల మీదుగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

మరమ్మతుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : విద్యుత్తు నియంత్రికల మరమ్మతుల్లో నిపుణులు ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యుత్తుశాఖ పర్యవేక్షక ఇంజినీరు శ్రావణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ హాలులో మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ఎస్పీఎం నిర్వాహకులకు ఏర్పాటు చేసిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు ఎస్పీఎం(స్పెషల్ ప్రొటెక్షన్ మెయింటెనెన్స్)కేంద్రాల నిర్వాహకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక మరమ్మతుల కేంద్రంలో కడప జిల్లాకు చెందిన నియంత్రికల తయారీ కేంద్రం నిర్వాహకులతో శిక్షణ ఇచ్చారు. డీఈలు పెద్ది రాజం, ఖైసర్, రాజన్న, వీరేశం, ఏడీఈలు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచాలి

కాసిపేట, న్యూస్‌టుడే: నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనులు చేసి లక్ష్యాన్ని సాధించాలని జీఎం దేవేందర్ అన్నారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిని సందర్శించారు. ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. అనంతరం గని ఆవరణలో మొక్కలు నాటారు. గని మేనేజర్ భూశంకరయ్య, కేకే గ్రూప్ ఏజెంట్ రాందాసు, గ్రూప్ ఇంజినీరు రాంప్రసాద్ పాల్గొన్నారు.

లాభాల వాటాపై తప్పుడు ప్రచారం

నస్పూర్, న్యూస్‌టుడే : సింగరేణిలో ఏటా మాదిరిగానే ఈ ఏడాది లాభాల వాటా ప్రకటించడం జరిగిందని దీనిపై తెబొగకాసం నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్ రావు పేర్కొన్నారు. శనివారం నస్పూర్‌లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మాట్లాడారు. శ్యాం, బీం రావు, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

నస్పూర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.33 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే-6, ఆర్కే-7 గని ద్వార సమావేశంలో మాట్లాడారు. నాయకులు వీరభద్రయ్య, సమ్మయ్య, కిషన్ రావు, సారయ్య పాల్గొన్నారు.